గండ్లు ఇలా..ఖరీఫ్ గట్టెక్కేదెలా?

- పూడ్చని తువ్వకాలువ గండ్లు..
- మంజూరుకాని నిధులు
- రబీలోనూ తీరని నష్టం
- పట్టించుకోని పాలకులు


మునేరు వరదలకు నామరూపాలు లేకుండా పోయిన తువ్వకాలువ మైసమ్మ గండి ప్రాంతం

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో వేల ఎకరాలకు సాగునీరు అందించే మునేరు తువ్వకాలువ గండ్లు ఎనిమిది నెలలుగా మరమ్మతులకు నోచుకోలేదు. వర్షాలు పడే సమయానికి ముందుగా వేసవిలో గండ్లు పూడిస్తేనే ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు అయినా అవకాశం ఉంటుందని, లేనిపక్షంలో ఖరీఫ్ లోనూ తీరని నష్టాలే మిగులుతాయని రైతులు దిగాలు చెందుతున్నారు.

కొట్టుకుపోయిన కాలువ..

వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు గ్రామం చివరన మునేరు పక్కనే ప్రధాన కాలువ నుంచి తువ్వకాలువ ప్రారంభమవుతుంది. మునేరుకు ఎప్పుడు వరదలు వచ్చినా మైసమ్మ గండి అనే ప్రాంతంలోనే గండ్లు పడుతుంటాయి. అయితే గతేడాది మునుపెన్నడూ లేని విధంగా వరద రావడంతో కొన్ని మీటర్ల మేర తువ్వకాలువ నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. కాలువ కొట్టుకుపోవడంతో వరద నీరంతా వత్సవాయి మండలంలోని వేమవరం, పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల, అనిగండ్లపాడు గ్రామాలను భారీగా చుట్టుముట్టింది. జూన్‌లో వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా తువ్వకాలువకు పడిన గండ్లను పూడ్చకపోతే ఈ ఖరీఫ్ సీజన్‌లోనూ పంటలను కోల్పోవాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్ర ఇబ్బందుల్లో రైతులు..

మునేరుకు వరదలు వచ్చిన ప్రతిసారీ తువ్వకాలువకు పలు చోట్ల గండ్లు పడటంతో సాగునీరు సక్రమంగా అందక రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వత్సవాయి మండలం పోలంపల్లి మునేరు ప్రాజెక్టులో తువ్వకాలువ ప్రధానమైనది. ఈకాలువ ఆళ్లూరుపాడు వద్ద ప్రారంభమై వేమవరం, పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, వెంకటాపురం, శనగపాడు గ్రామాల వరకు సుమారు మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తోంది. అయితే మునేరు ప్రధానకాలువకు గతంలో సిమెంట్ లైనింగ్ పనులు చేశారు. తువ్వకాలువ మాత్రం ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు.

నిధులు అంచనాలకే పరిమితం..

వేసవిలో గండ్లు పూడ్చకపోతే ఖరీఫ్ సీజన్‌లో పంటకు సాగునీరు అందడం కష్టమే. వరద నీరు మరలా పొలాలను ముంచేస్తుందని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం గండ్లు పూడ్చేందుకు రూ.1.60 కోట్లతో అంచనాలు రూపొందించి పంపించామని ఆరునెలలుగా చెబుతున్నప్పటికీ, మరమ్మతుల కోసం రాష్ట్రప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. దీంతో ఖరీఫ్ సాగులోనూ ఈ వరద ముంపు తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి తువ్వకాలువకు పడిన గండ్ల పూడ్చివేత పనులను వర్షాలు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

తువ్వకాలువకు 50 చోట్ల గండ్లు..

గతేడాది సెప్టెంబర్ నెలలో మునేరుకు వచ్చిన భారీ వరదలకు తువ్వకాలువకు 50 చోట్ల వరకు గండ్లు పడ్డాయి. దీంతో ఆయకట్టు రైతులు పంట నష్టపోవటంతోపాటు పొలాలు కూడా ఇసుక మేట వేశారు. భూమి కోతకు గురికావడంతో తీవ్రంగా నష్టపోయారు. ఆయా గండ్లను పూడ్చే విషయంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు రబీ పంట సాగులోనూ తీవ్రనష్టాలను చవిచూశారు.


భారీగా కొట్టుకుపోయిన తువ్వకాలువ

తక్షణమే గండ్లు పూడ్చాలి...


ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేయాలంటే వరదకారణంగా తువ్వకాలువకు పడిన గండ్లు వెంటనే పూడ్చాలి. గతేడాది వరదలకు పంట నష్టపోవడంతోపాటు ఇసుక మేట కారణంగా భూములు కూడా నష్టపోయారు. తక్షణమే పనులు ప్రారంభించి వేసవి ముగిసేలోపు గండ్లు పూడ్చివేతను పూర్తిచేయాలి.
మాదల రంగయ్య, రైతు, వేమవరం

పొలాలను ముంచుతోంది..


లేకపోతే వరదలు వచ్చిన ప్రతిసారీ రైతులు నష్టపోతున్నారు. గతేడాది సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలకు సాగుచేసిన వరి పంట కొట్టుకుపోయింది. మైసమ్మ గండి వద్ద తువ్వకాలువతోపాటు మునేరుకు కాంక్రీట్ గోడలు నిర్మించడం ద్వారా రక్షణ చర్యలు చేపట్టాలి.
పొన్నం ప్రసాదరావు, రైతు, గుమ్మడిదుర్రు

రైతుల గోడు పట్టించుకోవాలి..


కూటమి ప్రభుత్వానికి రైతుల గోడు ఏమాత్రం పట్టడం లేదు. తువ్వకాలువకు గండ్లు పడి ఎనిమిది నెలలు అవుతున్నా నేటి వరకు వాటిని పూడ్చలేదు. గతంలో తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గండ్లు పడితే యుద్ధప్రాతిపదిన పూడ్చివేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూశాం. వెంటనే గండ్లు పూడ్చకపోతే రైతుల తరపున పోరాడుతాం.
తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి

వాహనాల తనిఖీ


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వైవీఎల్ నాయుడు

నందిగామరూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించటం ద్వారా ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని సీఐ వైవిఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని అంబారుపేట వై జంక్షన్ వద్ద శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం తలకు గాయాలై మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నందున, ద్విచక్రవాహనదారులంతా తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ట్రైనీ ఐపీఎస్



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని ట్రైనీ ఐపీఎస్ సౌమ్యరెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆమెను వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అధికారులు ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సరిహద్దు చెక్‌పోస్టు పరిశీలన



ముక్త్యాల(జగ్గయ్యపేట): ఏపీ నుంచి అక్రమంగా తెలంగాణకు ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం ముక్త్యాలలోని సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కర్మాగారాలలో నిర్వహించే పనుల నిమిత్తమని చెప్పి ఇసుకను తెలంగాణకు తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తెలంగాణకు ఇసుకను తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్మాగారాల్లో పనులకు ఇసుక కావాలంటే పంచాయతీ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

వజ్రోత్సవాలకు హాజరుకావాలని పిలుపు

గరికపాడు(జగ్గయ్యపేట): గుంటూరు లాంఫాంలో ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించే ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు రైతులంతా హాజరుకావాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ అచ్యుతరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వజ్రోత్సవాల సందర్భంగా వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, చిన్న కమతాలతో సుస్థిరమైన నికరఆదాయం తదితర అంశాలపై నిర్వహించే సదస్సుల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

రైస్ మిల్లుల తనిఖీ



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని పద్మావతి, శ్రీనివాసా బాయిల్డ్ రైస్ మిల్లు, వెంకటేశ్వర రైస్ మిల్లులను నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిల్లు యజమానులను ఆదేశించారు. ముఖ్యంగా వాతావరణంలో మార్పుల కారణంగా మిల్లుల్లో ధాన్యం భద్రతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలంగాణ నుంచి వచ్చే ధాన్యాన్ని మిల్లర్‌లు కొనుగోలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఆర్డీఓ వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, పౌరసరఫరాలశాఖ డీటీ వెంకటేశ్వరరావు, ఎన్నికల డీటీ రాధిక ఉన్నారు.

పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

వత్సవాయి: తన విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ దేచుపాలెం గ్రామ కార్యదర్శి షేక్ జుబేదా శుక్రవారం వత్సవాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ఏడునెలలుగా తాను ఇక్కడ విధులు నిర్వర్తిస్తుండగా, అప్పటి నుంచి గ్రామానికి చెందిన ఎ.హరీష్, జిలానీ అనే యువకులు తన విధులకు తరచూ ఆటంకం కలిగిస్తున్నారన్నారు. పంచాయతీపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ తనను మానసికంగా వేధిస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా హరీష్, జిలానీలు కూడా కార్యదర్శి జుబేదాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయించకపోవడం, సైడ్ కాలువల్లో పూడికతీయించకపోవడంపై ఉన్నతాధికారులకు తెలియజేయంతో సదరు కార్యదర్శి తమపై ఇలా అకారణంగా పోలీసులకు ఫిర్యాదు చేశారంటూ వారిద్దరూ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

వీరులపాడు: మండలంలోని తాటిగుమ్మి, దొడ్డదేవరపాడు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఓ జనార్దన్ మాట్లాడుతూ రైతులు, ప్రజావసరాలకు అనుగుణంగా ఉపాధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు రామకృష్ణ, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణ, కార్యదర్శులు రాజశేఖర్, పుల్లయ్య పాల్గొన్నారు.

వేదాద్రి ఆలయ ప్రధానార్చకుడు మృతి



వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడు వేదాంతం లక్ష్మీ నరసింహాచార్యులు(75) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం స్వగ్రామం గరుడాచలంలో మృతి చెందారు. ఆలయ అర్చకునిగా ఆయన గత 50ఏళ్లుగా స్వామివారి సేవలో ఉన్నారు. లక్ష్మీనరసింహాచార్యులు మృతిపై ఆలయ ఈఓ సురేష్‌బాబు, వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి ఇందిరాదత్, పూజారులు, సిబ్బంది సంతాపం వ్యక్తంచేశారు.

నేటినుంచి రిజిస్ట్రేషన్లలో స్లాట్ బుకింగ్ విధానం


సబ్‌రిజిస్ట్రార్ నాగేశ్వరరావు

కంచికచర్ల : సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని కంచికచర్ల సబ్‌రిజిస్ట్రార్ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పబ్లిక్ డేటా ఎంట్రీ, ఐజీఆర్ఎస్ సైట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ సమకూర్చిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేయడం అనే మూడుపద్ధతుల్లో ఈ స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. స్లాట్ బుక్ చేసే సమయానికి ఇరుపార్టీలు, సాక్షులు అందుబాటులో ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరంకావడంతోపాటు వేగవంతంగా పూర్తవుతుందని వివరించారు. దీంతో సమయం ఆదాతోపాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, స్టాంప్ వెండర్లు, భూ యజమానులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యదర్శులు గమనించాలని సబ్‌రిజిస్ట్రార్ సూచించారు.


స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న నందిగామ సబ్‌రిజిస్ట్రార్ దుర్గారాణి

స్లాట్ బుకింగ్‌పై అవగాహన

నందిగామటౌన్: స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టం (స్లాట్ బుకింగ్)పై దస్తావేజు లేఖరులు, ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పబ్లిక్ డేటా ఎంట్రీ, అధికారిక వెబ్ సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని, ఈ ప్రక్రియతో ప్రజలకు ఎన్నో లాభాలున్నాయని వివరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సైతం వేగవంతం అవుతుందని, మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని వివరించారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు ధ్వంసం

వీరులపాడు: శ్రీరామనవమి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ మండలంలోని అల్లూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అల్లరి మూకలు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. అల్లరిమూకలు గత ఐదారు నెలలుగా పలుమార్లు ఫ్లెక్సీలను ధ్వంసం చేస్తున్నా పోలీసులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో పదే పదే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈసందర్భంగా మాజీ సర్పంచి కోటేరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామం గతంలో ఇటువంటి విష సంస్కృతి లేదన్నారు. అభివృద్ధితో పోటీ పడాలే తప్ప ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కొంతమంది అల్లరిమూకలు కావాలనే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ బందెల రాణి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మొండ్రు బాయమ్మ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కోటేరు విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్ ఉన్నారు.

ఉన్నత చదువులకు చేయూత



కంచికచర్ల : స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన మాడుగుల వర్షిత పదోతరగతి పరీక్షల్లో 600 మార్కులకుగాను 592 మార్కులు సాధించడంపై అరుంధతీయ సేవా సమితి సభ్యులు శుక్రవారం హర్షం వ్యక్తంచేస్తూ ఆ విద్యార్థినిని అభినందించింది. వర్షిత ఉన్నత చదువులకు సేవాసమితి తరపున ఆర్థికసాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సేవాసమితి గౌరవాధ్యక్షుడు ముండ్లపాటి పోతురాజు, కమిటీ సభ్యులు వేల్పుల ప్రభాకర్, శంకర్, మాడుగుల వాసుబాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్, రాఘవేంద్ర, ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది


ర్యాలీలో పాల్గొన్న వైస్‌చైర్మన్ హఫీజున్నీసా, అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు

జగ్గయ్యపేటఅర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దోమలను నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఆరోగ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొని కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కాకానినగర్ గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు రామలక్ష్మి, సామినేని మనోహర్, సంగెపు బుజ్జిబాబు, గింజుల్లి వెంకట్రావు, ఇర్రి నరసింహారావు, నాయకులు మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా పాల్గొన్నారు.

17వ వార్డులో..

పట్టణంలోని 17వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ వినతి



నందిగామరూరల్: ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని ఫ్యాప్టో నాయకులు బొద్దుకోలు రమణయ్య, దాసరి రాజ్‌కుమార్ కోరారు. జిల్లా ఫ్యాప్టో పిలుపు మేరకు 2024 సాధారణ ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయ, ఉద్యోగ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని కోరుతూ ఆర్డీవో బాలకృష్ణకు శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఫ్యాప్టో జిల్లాశాఖ తరపున కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందించామన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ వారం రోజుల్లో డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కామా ప్రభాకర్, గంగరాజు, లక్ష్మీనారాయణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

నందిగామటౌన్: పట్టణంలోని మెడికల్ షాపుల్లో శుక్రవారం డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. స్థానిక సీతారామ మెడికల్ దుకాణంలో దాదాపు మూడు గంటలపాటు రికార్డులు, మందులను తనిఖీ చేశారు. డ్రగ్ అధికారులు వస్తున్నారనే సమాచారంతో మిగిలినవారు తమ మెడికల్ షాపులను మూసివేశారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో చేనేత పరిశ్రమను ఆదుకోవడం రాష్ట్రప్రభుత్వ బాధ్యత అని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో చేనేత వృత్తిని కోల్పోయి ఆకలి చావులకు, ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులను గమనించిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం కింద ప్రతి చేనేత వృత్తిదారుడికి రూ.24వేలు ఆర్థికసాయం అందించారని గుర్తుచేశారు. చేనేత పరిశ్రమ పునరుద్ధరణకు, లక్షలాది చేనేత కళాకారుల కుటుంబాలకు జీవనభృతి కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మధురంగా సాగిన వీణా వాద్య కచేరీ



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్యామశాస్త్రి జయంతి సందర్భంగా శుక్రవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సంగీత నీరాజనం మధురంగా సాగింది. యువ సంగీత కళాకారులతోపాటు లబ్ధప్రతిష్టులైన విద్వాంసులు తమ కచేరీల ద్వారా గురుభక్తిని చాటుకున్నారు. సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి చిన్నారులు నిర్వహించిన వీణా వాద్య కచేరీ మధురంగా సాగింది. కార్యక్రమాలను సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామశాస్త్రి నాదోపాసకుడని, అమ్మవారి మీద అనేక కీర్తనలు రచించారని తెలిపారు. సంస్థ కార్యదర్శి సీవీ రావు మాట్లాడుతూ బాలబాలికలలోని ప్రతిభను ప్రోత్సహించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయంతి ఉత్సవంలో గండూరి శ్రీనివాసమూర్తి, చిట్టా రామలక్ష్మితో ఫ్లూట్ కుమార్‌బాబు, వీణ సుజాత, రావుల మీరాతో పాటు నగరానికి చెందిన పలువురు విద్వాంసులు పాల్గొన్నారు. సీహెచ్ సూర్య, విమలేష్ వాద్య సహకారం అందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న నందిగామ కమిషనర్ రమణబాబు


దోమల మందు స్ప్రే చేయిస్తున్న సర్పంచి పద్మకుమారి, పక్కన ఎంపీడీఓ శ్రీను


పెనుగంచిప్రోలులో అవగాహన ర్యాలీలో వైద్యాధికారి ఇందిర, వైద్య, ఆరోగ్య సిబ్బంది


చిల్లకల్లులో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో నితిన్, సిబ్బంది

నందిగామటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నందిగామలోని ఒకటి, తొమ్మిదోవార్డుల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, సత్యవతి, సచివాలయ సిబ్బంది, ఆయావార్డుల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహనా ర్యాలీ

పెనుగంచిప్రోలు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పర్యవేక్షణలో గ్రామంలో పంచాయతీ సిబ్బంది దోమల మందు స్ప్రే చేశారు. సర్పంచి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు. అదేవిధంగా వైద్యాధికారి ఇందిర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియా జ్వరం లక్షణాలు, వ్యాధి వ్యాపించే విధానం, దోమలు కుట్టకుండా, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లకల్లులో ఎంపీడీవో నితిన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మలేరియాపై అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల కార్యదర్శులు సంక్రాంత్, శివాజీ, జగ్గయ్య, ఇమామ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు భోజన వసతి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సదరం క్యాంపును వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. క్యాంపు వద్ద తగిన సదుపాయాలు లేకపోవడంతో సదరం సర్టిఫికెట్ రీవెరిఫికేషన్ కోసం దివ్యాంగులు ఇబ్బందిపడటాన్ని గమనించి వారికి తగిన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. క్యాంపునకు హాజరైన దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర ఎస్టీసెల్ నాయకుడు బద్దూ నాయక్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు దివ్వెల రామారావు, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, కార్మిక, ప్రచారం విభాగాల పట్టణ అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, నాయకులు కనపర్తి సత్యం, జక్కులూరి సురేష్, మార్కపూడి బాబు పాల్గొన్నారు.